సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయాలి

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- జిల్లాలో 27 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు
- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ పరిష్కరిస్తుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ తెలిపారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల మూడు నియోజకవర్గాల్లో 27 ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీమ్‌లను నియమించి సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యకాధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. అభ్యర్థులు ఓటర్లను మభ్యపెట్టేందుకు నగదు, మద్యం, వస్తువుల పంపిణీ చేస్తే సీ-విజిల్ యాప్‌లో ఫొటోలు, వీడియో తీసి అప్‌లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

రెవెన్యూ, మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో తాసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఫారం-6, రెవెన్యూ పరమైన అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ భాస్కర్, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌కు హాజరైన ఎమ్మెల్యేలు

కందూరులో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మూసాపేట/జడ్చర్ల, ఏప్రిల్ 4: అడ్డాకుల మండలంలోని కందూరు జామ మసీద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేవేందర్ రెడ్డి ముస్లింలకు గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,నాయకులు హాజరయ్యారు. ముస్లిం మతపెద్దలతో కలిసి విందు ఆరగించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్లలో..

జడ్చర్లలోని చంద్రా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

పాలమూరు, ఏప్రిల్ 4 : ఉపాధ్యాయుల చేతుల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కాలర్స్ పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు ఉత్తమ విద్యాప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్, పాఠశాల యాజమాన్యం రవి, రామాంజనేయులు, మాధవరెడ్డి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- ప్రత్యేకాధికారి, ఇంటర్‌విద్య డైరెక్టర్ శృతిఓజా

మాట్లాడుతున్న ప్రత్యకాధికారి శృతి ఓజా

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 4 : వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి, ఇంటర్‌విద్య డైరెక్టర్ శృతి ఓజా అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవినాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి మిషన్ భగీరథ, పంచాయితీరాజ్, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి వనరులు, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

పకడ్బందీ చర్యలు : కలెక్టర్

అనంతరం కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రత్యక నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమించి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. సమావేశంలో మిషన్ భగీరథ అధికారి వెంకటరమణ, పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లు, ఈఈలు పుల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 4 : ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న దృష్ట్యా వడదెబ్బ తగులకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నారాయణపేటను ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించిన నేపథ్యంలో రానున్న మూడు రోజుల్లో అత్యవసరమైతే తప్పా ప్రజలు ఎండలో బయట తిరుగరాదన్నారు. బయటకు వెళ్తే తెల్లటి వస్త్రాలు, టోపీ, గొడుగు ధరించాలన్నారు. మధ్యాహ్నం 11గంటల నుంచి 4వరకు ఇండ్ల నుంచి బయటకు రావొద్దన్నారు. టీ, కాఫీ, ఆల్కహాల్, స్వీట్లు, కూల్‌డ్రింక్స్ తీసుకోరాదన్నారు. చిన్నారులు, వృద్ధులు బయటికి రావొద్దని కోరా రు. ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రాం తాలకు వెళ్లరాదని, సూర్యుడి కిరణాలు శరీరంపై పడకుండా చూడాలన్నారు. కార్మికులు తరచుగా నీటితోపాటు ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. చర్మంపై ఎర్రటి దద్దుర్లు, చర్మం పొడిబారడం, అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండిపోవడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, వాంతులు, జ్వరం తదితర లక్షణాలు కలిపిస్తే సమీప ప్రభుత్వ దవాఖానలో చికిత్స తీసుకోవాలన్నారు.

అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు హన్మంతు

సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి

ఊట్కూర్, ఏప్రిల్ 4 : అధికారు లు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో పని చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృ షి చేయాలని ఎంపీపీ ఎల్కో టి లక్ష్మి అన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ అశోక్‌కుమార్ గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు హన్మంతు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఈజీఎస్ అధికారుల పనితీరును సభలో ప్రస్తావిస్తూ అసహనం వ్యక్తం చేశారు. తమకు సమాచారం లేకుండానే గ్రా మాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పులిమామిడిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్ కోరారు. సమావేశంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, ఏప్రిల్ 4 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో చేరేందుకు ఆసక్తి గల బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లారెన్స్‌రాణి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు WWW.TSWREIS.AC.IN ద్వారా ఆన్‌లైన్‌లో ఏప్రిల్18వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశపరీక్ష మే5వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్ కిందపడి విద్యార్థి మృతి

ప్రకాశ్ (ఫైల్)

కృష్ణ, ఏప్రిల్ 4: ట్రాక్టర్ కింద పడి విద్యార్థి మృతిచెందిన ఘటన మండలంలోని ఆలంపల్లి-కున్సి గ్రామాల మధ్య చోటుచేసుకున్నది. స్థానికులు కథనం ప్రకారం.. ఆలంపల్లికి చెందిన ప్రకాశ్ కున్సి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రోజూ పాఠశాలకు సైకిల్‌పై వెళ్లేవాడు. గురువారం పాఠశాలకు వెళ్తుండగా వెనక నుంచి పత్తిలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం కోసం శవాన్ని మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై నవీద్ తెలిపారు.

రైలు కిందపడి మహిళ ..

మక్తల్ టౌన్, ఏప్రిల్ 4 : గూడ్స్ రైలు కింద పడి మహిళ మృతిచెందిన ఘటన మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. వివరాల్లోకెళ్తే.. మక్తల్ మున్సిపాలిటీలోని కొత్తగార్లపల్లికి చెందిన పోలమ్మ(50) మతిస్థిమితం లేకుండా కొన్నాళ్లుగా తిరుగుతున్నది. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లగా, పట్టణ సమీపంలోని కృష్ణా-మునీరాబాద్ రైల్వే లైన్‌పై మృతి చెంది కనిపించింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం శవాన్ని మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 4 : హన్వాడ మండలంలో సారా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసి, తాసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి గురువారం తెలిపారు. హన్వాడ మండలంలోని వెంకటమ్మకుంట తండా సమీపంలో విస్లావత్ రఘు బైక్‌పై వెళ్తుండగా అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, ఆరు లీటర్ల సారా పట్టుబడిందన్నారు. ఈ మేరకు బైక్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై కరుణ, ఎక్సైజ్ సిబ్బంది అంజి, నాగరాజు, బబ్బీశ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవాబ్‌పేట, ఏప్రిల్ 4 : ప్రజల దాహం తీర్చేందుకు మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రజాప్రతినిధులు గురువారం ప్రారంభించారు. కాకర్లపహాడ్‌కు చెందిన నరేశ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. యువత సమాజ సేవలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుశ్యంత్‌రెడ్డి, రాంచంద్రయ్య, మల్లేష్‌యాదవ్, రాజశేఖర్ ఉన్నారు.

నవాబ్‌పేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నేడు జగ్జీవన్‌రాం జయంతి

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బాబు జగ్జీవన్ రాం జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారి శ్రీనివాస్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ రవినాయక్ తదితరులు హాజరవుతారన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నవాబ్‌పేట, ఏప్రిల్ 4 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 6న ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

జాతీయ కోఆర్డినేటర్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి

మరికల్, ఏప్రిల్ 4 : బీజేపీ యువ మోర్చ జాతీయ కోఆర్డినేటర్‌గా మండలంలోని అప్పంపల్లికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డిని నియమించారు. విజయ్‌కుమార్ ఎంపికపై మండల నాయకులు నరేశ్ గౌడ్, రమేశ్, వెంకటేశ్, వేణుగోపాల్, నరేశ్‌కుమార్‌రెడ్డి, శ్రీరామ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలలకు మైక్‌సెట్, వాటర్ ఫిల్టర్ వితరణ

జాజాపూర్‌లో మైక్‌సెట్ ఇస్తున్న పూర్వవిద్యార్థులు

కన్మనూర్‌లో వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న దృశ్యం

పొన్నకల్‌లో వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న దృశ్యం

నారాయణపేట రూరల్/మరికల్, ఏప్రిల్ 4 : మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలకు గురువారం 2013-14 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా మెక్‌సెట్ వితరణ చేసిన నర్సింహ, గోపాల్, అశోక్, మహేశ్, పవన్, రవీందర్‌లను హెచ్ఎం కనకప్ప అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, శోభారాణి, భానుప్రకాశ్, మధుసూదన్, లక్ష్మణ్, శిరీష, నిర్మల పాల్గొన్నారు.

కన్మనూర్‌లో..

మరికల్ మండలంలోని కన్మనూర్ ప్రాథమిక పాఠశాలకు శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్‌ను గురువారం వితరణ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మి, సదాన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ధన్వాడ మండల కేంద్రంలోని సంతబజార్ ప్రాథమిక పాఠశాలలో వాటర్‌ఫిల్టర్ అందించారు.

పొన్నకల్‌లో..

మూసాపేట, ఏప్రిల్ 4: అడ్డాకుల మండలంలోని పొనకల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం శిక్షణ ఫౌండేషన్ వారు గురువారం వాటర్ ఫిల్టర్ అందజేశారు. అనంతరం కోఆర్డినేటర్ జగప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులే ఎక్కువగా వస్తుంటారని, వారికి స్వచ్ఛమైన తాగునీరందించాలని వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సంజీవరెడ్డి, ఉపాధ్యాయ బృందం ఆంజనేయులు, శ్యామ్, వాణి, విద్యార్థులు పాల్గొన్నారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్‌ను శాలువాతో సన్మానించారు.

వేరుశనగ @రూ.7,350

జడ్చర్ల, ఏప్రిల్ 4 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగకు అత్యధికంగా క్వింటా రూ.7,350ధర పలికింది. 215క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా, గరిష్ఠంగా రూ.7,350, కనిష్ఠంగా రూ.5,708, మధ్యస్తంగా రూ.6,118 ధర పలికింది. 167క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.5,808 ధర పలికింది. 16క్వింటాళ్ల జొన్నలు రాగా, గరిష్ఠంగా రూ.4,977, మొక్కజొన్న 1010 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.2,238,ఆర్ఎన్ఆర్ 15క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.2,211, రాగులు 8క్వింటాళ్లు అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.3,859ధర పలికింది.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసులు

ఊట్కూర్, ఏప్రిల్ 4 : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని పులిమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు రవళి, నవీన, మహేశ్వరి సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖరయ్య, గైడ్ టీచర్ నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై ఐదుశాతం రాయితీ

భూత్పూర్, ఏప్రిల్ 4: మున్సిపాలిటీ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆస్తి పన్నులు చెల్లించే యజమానులు ఐదుశాతం రాయితీ పొందాలని మున్సిపాలిటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోగా పన్ను చెలించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

ప్రభుత్వ దవాఖానలో అన్నదానం

అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 4 : ఇండియన్ మెడికల్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉమాకాంత్ జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ దవాఖానలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్ డా.కార్తీక్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటయ్య, శ్రీనివాస్ లాహోతి, భీంచందర్‌గౌడ్, సత్యనారాయణ, సురేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో జీవితాలు బలిచేసుకోవద్దు

దామరగిద్ద, ఏప్రిల్ 4 : తెలిసి తెలియని వయసులో ప్రేమ పేరుతో మోసపోయి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం ప్రేమ, ఆకర్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు కతలప్ప, సుందరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై నిర్లక్ష్యం తగదు

సమస్యలు తెలుసుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు

ఊట్కూర్, ఏప్రిల్ 4 : ఎండలు తీవ్ర స్థాయిలో మండిపోతున్నా ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు లేకుండా పనులు చేయిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కనకరాయుడు, తిప్పయ్య అన్నారు. శుక్రవారం సీఐటీయూ నాయకులు పడిగిమర్రిలో, ఏఐటీయూసీ నాయకులు పెద్దపొర్లలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పనిముట్లు ఇవ్వడం లేదని, ఎండతీవ్రతకు నీటి వసతి, ఓఆర్ఎస్ పంపిణీ చేయడం లేదన్నారు. కూలీలందరికీ రోజుకు రూ. 600 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

మక్తల్ టౌన్, ఏప్రిల్ 4 : వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ వనజ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు వసతులు కల్పించాలని, కూలి సకాలంలో ఇవ్వాలని, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రామేశ్వరమ్మ, ఎంపీడీవో, తాసీల్దార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, ఏప్రిల్ 4: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలలో డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి కన్యాకుమారి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీ 2024కు దరఖాస్తు చేసుకొని, డైట్ లేదా బీఎడ్ లేదా రెండింటిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, టెట్ అర్హత ఉండాలన్నారు. ఆసక్తి గల వారు 5న(శుక్రవారం) మహబూబ్‌నగర్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో స్పాట్ అడ్మిషన్‌కు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 8977340006 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాలికపై లైంగికదాడి

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 4: మండలంలోని కోడ్గల్ శివారులోని ఓ తండాలో బాలిక (6)పై అదే తండాకు చెందిన బాలుడు(12) లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బాలుడు లైంగిక దాడికి పాల్పడిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రులు గురువారం రాత్రి సదరు బాలుడిపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం పట్టివేత

నారాయణపేట, ఏప్రిల్ 4 : నారాయణపేట నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. జాకీర్‌హుస్సేన్ నారాయణపేట నుంచి కొల్లంపల్లికి 46.65 లీటర్ల మద్యం తరలిస్తుండగా, అంబేద్కర్ చౌరస్తా వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.